క్లుప్తంగా

నేడు అంజిమేడులో 'గడపగడపకు'

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు పంచాయతీలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, ఎంపీడీఓ గిడ్డయ్య శనివారం తెలిపారు. పంచాయతీ పరిధిలోని కృష్ణగిరి కాలనీ, పోతుమానిగుంట ఎస్టీ కాలనీల్లో మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరుకానున్నట్లు వివరించారు. అన్ని శాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 33/11కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులు, లైన్ల మరమ్మతులు చేస్తున్న కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, ఏర్పేడు, తొట్టంబేడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాజేష్ గురుకుల్‌కు పురస్కారం


పురస్కారం అందుకుంటున్న రాజేష్ గురుకుల్

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో అభిషేక గురుకుల్‌గా విధులు నిర్వహిస్తున్న రాజేష్ గురుకుల్‌కు పురస్కారం లభించింది. హైదరాబాద్ చిక్కడపల్లి లోని త్యాగరాజ గాన సభలో శిఖరం ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో శోభాకృత్ నామ సంవత్సరం ఉగాది నంది పురస్కారాల్లో భాగంగా ఆయనకు ఉగాది నంది పురస్కారం, అలంకార చక్రవర్తి బిరుదును ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసగుప్తా తదితరులు పాల్గొన్నారు.

మండల మీట్ రేపు

పిచ్చాటూరు: నాగలాపురం మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పద్మజ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నాగలాపురం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ సింధు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని ఆమె కోరారు.


రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. శ్రీకాళహస్తి నుంచి సూళ్లూరుపేటకు వెళుతున్న ఆర్టీసీ బస్సు తొట్టంబేడు వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న మోహన్‌రాజ్, తరుణ్‌కు గాయాలయ్యాయి. వారిని శ్రీకాళహస్తి ఆస్పత్రికి తరలించారు. ఎస్ఐ రాఘవేంద్ర కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. స్థానికులు సరైన సమయానికి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించడంతో ప్రమాదం తప్పినట్లు వెల్లడించారు.

పందెంరాయుళ్ల అరెస్ట్

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): తొట్టంబేడు మండలం కంచనపల్లెలో కోడి పందేలు ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. వారి నుంచి రెండు కోళ్లు, రూ.3020 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మండలంలో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

శేషాచల అడవుల్లో గుర్తుతెలియని వ్యక్తులు?


శేషాచల అడవుల్లో టార్చిలైటు వెలుతురు

ఏర్పేడు: ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని శేషాచల అడవుల్లో నందిపర్వతం వద్ద శనివారం రాత్రి టార్చి లైట్లతో గుర్తు తెలియని వ్యక్తులు ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. ఆ ప్రాంతంలో మంటలు ఉండడం, మంటలకు ఎగువన టార్చిలైట్లతో గుర్తు తెలియని వ్యక్తులు ఉండడాన్ని గమనించారు. రాత్రిళ్లు అటవీ ప్రాంతంలో ఎందుకు ఉన్నారు? అంత ఎత్తులో ఎందుకు ఉంటున్నారు? అనేది చర్చనీయాంశంగా మారింది. అక్కడ మంటలు ఉండడంతో ఎవరైనా మంటల్లో చిక్కుకుని సహాయం కోసం అర్థిస్తున్నారా? మరేదైనా ఇతర కారణాలు తెలియరావాల్సి ఉంది.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి నెల్లూరు జిల్లా రాపూర్ మండలానికి చెందిన చెన్ను బాలకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు డాక్టర్ బాలకృష్ణారెడ్డి శనివారం రూ.25 వేలు అందించారు. నగదును పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపి స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు.

జనం గుండెల్లో జగన్ నినాదం

- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం
- అట్టహాసంగా 'జగనన్నే మా భవిష్యత్'
- ఎమ్మెల్యే ఆదిమూలం విస్తృత ప్రచారం


పిచ్చాటూరు మండలం కీళపూడిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: ప్రజల గుండెల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేరు వినిపిస్తోందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శనివారం పిచ్చాటూరు మండలం కీళపూడిలో, నాగలాపురం మండలం కృష్ణాపురంలో 'జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఇంటింటికి స్థానిక పార్టీ నాయకులు, గ్రామ సీఎం వలంటీర్లు, గృహ సారథులతో కలిసి వెళ్లి తలుపులకు, మొబైల్ ఫోన్లకు జగన్ ఫొటో ఉన్న స్టిక్కర్లను అతికించారు. అలాగే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిన్నచిన్న సమస్యలను అక్కడికక్కడే స్థానిక నేతల సహకారంతో పరిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా నాలుగు సర్వే ప్రశ్నలను కుటుంబ సభ్యులను అడిగి వారు చెప్పిన సమాధానాలను బుక్‌లెట్‌లో పూరించారు. వారి మొబైల్ ఫోన్ నుంచి పార్టీ ఏర్పాటు చేసిన నంబరుకు మిస్డ్ కాల్ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద మహిళలు ఆప్యాయంగా స్వాగతిస్తున్నారని తెలిపారు. ఇదే ఆప్యాయతను 2024 ఎన్నికల్లో చూపాలని, జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

మృతుని కుటుంబాన్ని ఆదుకుంటాం

క్రిష్ణాపురంలో రెండు వారాల క్రితం అనారోగ్యంతో మరణించిన దేవేంద్రన్ కుటుంబాన్ని ఎమ్మెల్యే ఆదిమూలం పరామర్శించారు. మృతుని భార్య హేమావతి, నలుగురు చిన్నపిల్లలను చూసి ఎమ్మెల్యే చలించిపోయారు. ఈ కుటుంబానికి వైఎస్సార్ బీమా కింది రూ.10 వేలు ఇచ్చామని, మిగిలిన రూ.90 వేలు కూడా తక్షణం అందేలా చూడాలని, మృతుని భార్యకు వితంతు పింఛన్‌కు దరఖాస్తు చేయాలని అక్కడే ఉన్న వాలంటీర్ సత్యను ఎమ్మెల్యే ఆదేశించారు. మృతుని నలుగురు పిల్లలను గురుకుల పాఠశాలలో చదివించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంఘమిత్ర మాంబకు సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సునంద, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అపరంజిరాజు(నాగలాపురం), రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ పాలపద్మనాభం, సచివాలయ మండల కన్వీనర్లు తొప్పయ్య, మోహన్ మొదలి, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి గజేంద్ర, ఏఎంసీ డైరెక్టర్లు కులశేఖర్, అలగేశన్, సర్పంచ్ మహేంద్రన్, నాయకులు ఎస్ఎం సురేష్, చలపతిరాజు, మోహన్, చెంగల్రాయ రెడ్డి, బాబు, అన్బు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిలో నమ్మకాన్ని పెంచండి

నారాయణవనం: జగనన్న పాలనపై ప్రతి ఒక్కరిలో నమ్మకాన్ని పెంచాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచించారు. శనివారం సాయంత్రం మండల కేంద్రం నారాయణవనంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కైనికట్టు వీధిలో ప్రతి ఇంటికీ వెళ్లి ఆయన ప్రజలను పలకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, జేసీఎం మండల కన్వీనర్ బాబు, మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి, ఏకాంబరం, వైస్ ఎంపీపీ శివశంకర్, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు చిన్నదొరై, మోహన్, శంకరయ్య, సారకాయలు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

పథకాలు అందించకుంటే ఉపేక్షించం

రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు సకాలంలో లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేయకుంటే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హెచ్చరించారు. శనివారం సాయంత్రం మండల కేంద్రం నారాయణవనం కైనికట్టు వీధిలో మహిళలతో ఆయన మాట్లాడారు. మూడో విడత ఆసరా నగదు తమ ఖాతాల్లోకి జమ కాలేదని, రేషన్ బియ్యం సక్రమంగా పంపిణీ కావడం లేదని ఆయన దృష్టికి పలువురు మహిళలు తీసుకువచ్చారు. స్పందించిన ఆయన తహసీల్దార్, వెలుగు ఏపీఎంలతో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ సరుకులు ఇళ్ల వద్దకు వెళ్లి ఇవ్వని ఆపరేటర్లు, డీలర్లపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని, సోమవారం నుంచి మరొకరితో రేషన్ సరఫరా చేయించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. సోమవారం నాటికి మండలంలోని అందరి మహిళల ఖాతాల్లో ఆసరా నగదు జమ చేయించాలని ఏపీఎంను ఆదేశించారు.

సత్యవేడులో..

సత్యవేడు: మండలంలోని పుదుకుప్పంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, ముఖ్యనాయకులతో కలసి మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో నిర్వహించారు.

'జగనన్నే మా భవిష్యత్'కు విశేష స్పందన

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని మండల కన్వీనరు ఆరణి విద్యానాథరెడ్డి తెలిపారు. ఆయన శనివారం ఆర్.అనంతాపురం, వీఎస్‌పురం, పెద్దపాలేడు గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమానికి హాజరై గృహసారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు పలు సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మణినాయుడు, సర్పంచ్‌లు వెంకటేష్, సిద్ధమ్మ, ఎంపీటీసీ సభ్యులు పుట్టయ్య, నాయకులు బీ.కృష్ణయ్య, వెంకటకృష్ణయ్య, తులసీరామ్, భాస్కర్‌రెడ్డి, వెంకటయ్య, శంకరయ్య, పట్టాభిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమ్మాన్‌లో 7.5 శాతం వడ్డీ

- శ్రీకాళహస్తి తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ మణికండన్

శ్రీకాళహస్తి రూరల్: మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం తపాలాశాఖ ద్వారా మహిళా సమ్మాన్ పథకాన్ని తీసుకొచ్చిందని.. మహిళలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాళహస్తి తపాలాశాఖ ఇన్‌స్పెక్టర్ మణికండన్ అన్నారు. శ్రీకాళహస్తి తపాలాశాఖ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. భారత ప్రభుత్వం తపాలాశాఖ పెట్టుబడుల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడానికి, మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి చిన్న మొత్తాల పొదుపు పథకం కింద తపాలాశాఖ కార్యాలయాల్లో ఈ నెల ఒకటి నుంచి మహిళా సమ్మాన్ సేవింగ్ పథకాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు. ఈ పథకంలో మహిళలు మాత్రమే పెట్టుబడులు పెట్టుకోవడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఈ పథకం ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ రాబడి పొందే విధంగా సంవత్సరానికి 7.5 శాతం వడ్డీ ఇవ్వనుందని పేర్కొన్నారు. ఇందులో కనీసం రూ.1,000 నుంచి 2,00,000 వరకు పెట్టుబడి పెట్టుకోవచ్చని వివరించారు. ఈ పథకం కాలపరిమితి రెండేళ్లు మాత్రమేనని అన్నారు. పూర్తి వివరాలకు ఆయా గ్రామాల పరిధిలోని తపాలశాఖ కార్యాలయాల్లో సంప్రదించాలని తెలిపారు.

రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీల్లో ప్రతిభ

శ్రీకాళహస్తి: నరసరావుపేటలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీల్లో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన విక్రమ్ టెన్నిస్ అకాడమి క్రీడాకారులు ప్రతిభ చూపారు. వివిధ విభాగాల్లో కరణ్‌సాయి, విశాల్ రాజ్, లీలా మహేష్, జ్యోత్స్న, విధిత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని శనివారం పట్టణంలోని విక్రమ్ విద్యాసంస్థల ప్రాంగణంలో డాక్టర్ చంద్రశేఖర్, పలువురు అభినందించారు.



ప్రతిభ చూపిన క్రీడాకారులతో చంద్రశేఖర్

పలువురికి నివాళి

సత్యవేడు: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కేఎస్ మునిచంద్రారెడ్డి, బీసీ కాలనీ ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రేణుక శనివారం ఉదయం మృతి చెందారు. విషయం తెలిసి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆయా గ్రామాలకు చేరుకుని మృతదేహాల వద్ద నివాళులు అర్పించారు. అనంతరం అల్లపుగుంటలో పార్టీ కార్యకర్త మురగయ్య నాలుగు రోజుల క్రితం చనిపోవడంతో వారి కుటుంబసభ్యులను కలసి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ కే.రవి, మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, సర్పంచ్ మునస్వామి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


సంతాపం తెలుపుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న విహారం

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి శనివారం సాయంత్రం తిరుచ్చిపై భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఊంజల్ సేవను కనుల పండువగా చేపట్టారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి తిరుచ్చి వాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దివ్య దర్శనమిచ్చారు.

వైభవంగా ప్రసన్న వెంకన్న గ్రామోత్సవం

వడమాలపేట : టీటీడీ అనుబంధ ఆలయమైన అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరుచ్చి గ్రామోత్సవం, ఊంజల్‌సేవను ఆలయ అధికారులు శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువ జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాలసేవ, నిత్యకైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించారు. అనంతరం వేదపండితులు మంత్రాలు పఠిస్తూ భక్తుల గోవిందనామస్మరణ నడుమ శ్రీవారికి ఊంజల్‌సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితులైన పద్మావతి ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామిని మంగళవాయిద్యాలు నడుమ మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వరుసగా రెండురోజులు సెలవు కావడంతో ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. రాత్రి స్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.


తిరుచ్చిపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి

ముక్కంటి సేవలో ఏపీఐఐసీ చైర్మన్


ఆలయ ధ్వజస్తంభం వద్ద మెట్టు గోవిందరెడ్డి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద ఏఈఓ సతీష్ మాలిక్, ఆర్టీఓ రామారావు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయపండితులు ఆశీర్వదించారు. జ్ఞాపిక తీర్థప్రసాదాలు అందజేశారు.

నేటి నుంచి ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు

తిరుపతి కల్చరల్: ఆంధ్రరాష్ట్ర సాహిత్య అకాడమీ సౌజన్యంతో శ్రీశ్రీ కళావేదిక, ఇంద్రాణి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా మహతి కళాక్షేత్రంలో ఆది, సోమవారం ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శ్రీశ్రీకళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ తెలిపారు. ఆయన శనివారం మహతి కళాక్షేత్రంలో విలేకరులతో మాట్లాడారు. తెలుగు భాషా విశిష్టత కోసం శ్రీశ్రీ కళావేదిక నిరంతరం కృషి చేస్తూ కవులు, కళాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. ఈ క్రమంలోనే తిరుపతిలో ప్రపంచ సాహితీ బ్రహ్మోత్సవాలు నిర్వహించి వరల్డ్ రికార్డు నెలకొల్పేలా 48 గంటల నిరవధికంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రపంచ కవితోత్సవం, సాహిత్య సదస్సులు, కళాప్రదర్శనలు, పుస్తకా విష్కరణలు తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో ప్రోగ్రాం కన్వీనర్ గుత్తాహరి సర్వోత్తమనాయుడు, కన్వీనర్ కొల్లి రమావతి, శ్రీశ్రీ కళావేదిక తెలంగాణ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని శనివారం తెలంగాణ ఎలక్షన్ కమిషనర్ పార్థసారథి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ రాజేశ్వరరావు, జస్టిస్ శ్రీదేవి, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, సినీ డైరెక్టర్ గౌరీ రోణంకి దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

బీసీల జనగణనపై కేంద్రం నిర్లక్ష్య వైఖరి

తిరుపతి కల్చరల్: బీసీల జనగణన చేపట్టడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అనుసరిస్తోందని ఏపీ బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కొంతి నాగరాజు విమర్శించారు. ఆయన శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. స్వాతంత్రం వచ్చి 75 ఏళ్ల గడుస్తున్నా దేశంలోని బీసీ కులాలకు సముచిత ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. దేశంలో జంతువుల లెక్కలు ఉన్నాయని, బీసీ కులాలకు లెక్కలు లేకపోవడం శోచనీయమన్నారు. బీసీలకు జనగణన కులగణన చేయాలనే ప్రధాన డిమాండ్‌తో కేంద్రం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానున్నట్లు తెలిపారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి


సంక్షేమ పథకాలపై గ్రామస్తులను అడిగి తెలుసుకుంటున్న ఎంపీ మద్దిల గురుమూర్తి

- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ఎంపీ గురుమూర్తి

ఏర్పేడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి అన్నారు. శనివారం ఎంపీ తన స్వగ్రామమైన మన్నసముద్రంలో జరిగిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అంటించి, కరపత్రాలు అందజేశారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీ మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే జగనన్న లక్ష్యమని, వారి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. ఇచ్చిన హామీలన్నీ నేరవేర్చాం కనుకే ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లగలుగుతున్నామని చెప్పారు. 2014లో చంద్రబాబు ఎన్నికల మ్యానిఫెస్టోపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితులో లేరన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి ప్రజలు బుద్ధిచెబుతారన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు తాళ్లపాక నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, మునికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


బండారుపల్లెలో జనార్ధన్‌రెడ్డి, నాయకులు

గ్రామాల్లో విస్తృత ప్రచారం

ఏర్పేడు: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం జరిగింది. బండారుపల్లెలో వైస్ ఎంపీపీ తిరుపతి జనార్ధన్‌రెడ్డి, ఎండీపుత్తూరు, ఇసుకతాగేలి తదితర గ్రామాల్లో ఆయా సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అంటించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు.

వందేభారత్‌కు శ్రీకాళహస్తిలో బ్రహ్మరథం


జాతీయ జెండా ఊపుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల మధ్య ప్రారంభమైన సెమీ హై స్పీడ్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు శనివారం ప్రధాని నరేంద్రమోదీ సికింద్రాబాద్‌లో ప్రారంభించగా శ్రీకాళహస్తికి రాత్రి 9 గంటలకు చేరింది. ఈ సందర్భంగా ఎంపీ మద్దెల గురుమూర్తి, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, బీజేపీ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, కోలా ఆనంద్, కండ్రిగ ఉమ, రైల్వే బోర్డు మెంబర్ మురళీశెట్టి, రైల్వే అధికారులు పూలు చల్లి స్వాగతం పలికారు. శ్రీకాళహస్తిలో వందేభారత్ రైలు ఆగేందుకు కృషి చేస్తామన్నారు. వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ షేక్ సిరాజ్‌బాషా, బోర్డు మెంబర్ మున్నా, జైశ్యామ్, వయ్యాల కృష్ణారెడ్డి, శ్రీవారి సురేష్, కంటా ఉదయ్‌కుమార్, మధురెడ్డి, దాము, పసల కృష్ణయ్య, గాడిపాకుల కిరణ్, డీఎస్పీ విశ్వనాథ్, స్టేషన్ మాస్టర్ మన్మోహన్ తదితరులు పాల్గొన్నారు

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



రోగులకు మందులను పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది, మురుగునీటి కాలువలో బ్లీచింగ్ చల్లుతున్న సిబ్బంది

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రామాల్లో ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారి డాక్టర్ మాధవి, డాక్టర్ దివాకర్‌బాబు తెలిపారు. శనివారం కారణి గ్రామంలోని హరిజనవాడలో డెంగీ జ్వరాలు సోకుతుండడంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 45 మందికి వైద్య పరీక్షలు చేసి, 8 మంది జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించి వైద్యం అందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డెంగీ జ్వరం దోమకాటుతో వ్యాప్తి చెందుతుందని, పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలన్నారు.

దోమల నివారణకు బ్లీచింగ్..

మురుగునీటి కాలువల్లో, నీరు నిల్వ ఉన్న చోట గ్రామ కార్యదర్శులు ఇందిరమ్మ, ప్రసన్న, పారిశుద్ధ్య కార్మికుల చేత బ్లీచింగ్ చల్లించారు. తాగునీటి ట్యాంకులో క్లోరినేషన్ చేయించారు. వీధుల్లో చెత్తా, చెదారాన్ని తొలగించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పద్మకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ గంగమ్మ పాల్గొన్నారు.

చీకట్లోనే పది పరీక్ష

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. గదులకు ఉన్న కిటికీల తలుపులను మూసివేయడంతో చీకట్లోనే పరీక్ష రాస్తున్నారు. గాలి ఆడక విద్యార్థులు చెమటలు కక్కుతూ, వెలుతురు లేక ఇబ్బంది పడుతూనే పరీక్షలను రాస్తున్నారు. చిట్టాలు వేస్తున్నారనే నెపంతో అధికారులు కిటికీలను మూసివేయడంపై విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన తెలుపుతున్నారు. అధికారులు స్పందించి గదుల కిటికీ తలుపులను తెరవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


పరీక్ష కేంద్రంలోని గది కిటికీలను మూసేసిన దృశ్యం

ఉద్యోగాల పేరుతో కుచ్చుటోపి

కేవీపల్లె: ఉద్యోగాల పేరుతో నిరుద్యోగులకు మోసం చేసి కుచ్చుటోపి పెట్టిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. కొందరు బాధితులు శనివారం కేవీపల్లె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంలో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కేవీపల్లె మండలం గర్నిమిట్ట పంచాయతీ బలిజపల్లెకు చెందిన తొగురు రెడ్డిదినేష్‌కుమార్ మరికొందరితో కలసి ముఠాగా ఏర్పడి సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో నిరుద్యోగులకు వల వేశాడు. 2017లో కేవీపల్లె మండలంలోని పలువురు నిరుద్యోగ యువకులకు టీటీడీలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మబలికాడు. డబ్బులు ఇస్తే ఉద్యోగం గ్యారెంటి అని నమ్మించి ఒక్కొక్కరి వద్ద రూ.10 లక్షలకు పైగా వసూలు చేశాడు. నిరుద్యోగులకు టీటీడీ పేరుతో జాయినింగ్ ప్రొసీడింగ్ లెటరు ఇవ్వడంతో వారు నమ్మారు. కొందరిని తిరుమలకు తీసుకెళ్లి పార్కుల వద్ద చెట్టు కింద కూర్చోబెట్టి ఇక్కడే మీరు విధులు నిర్వహించాల్సింది, మీది సులభమైన ఉద్యోగం పార్కును పర్యవేక్షిస్తూ ఉండాలి అంతే అని నమ్మించారు. మూడు నెలల పాటు కొందరికీ నకిలీ సాలరీ రిపోర్టు స్లిప్ ఇచ్చారు. అంతేగాక కొందరి ఖాతాలకు రూ.33,983 చొప్పున మూడు నెలలు జమ చేశారు. జీతాలు వచ్చాయని వీరి ద్వారా తెలుసుకున్న మరికొందరు నిరుద్యోగ అమాయకులు రూ.లక్షల్లో ముట్టజెప్పారు. అయితే కొంత కాలానికి ఉద్యోగాలు లేవు ఏమి లేదు, ఇచ్చిన పత్రాలు అన్నీ నకిలీవని తెలుసుకున్న బాధితులు అప్పట్లో తిరుమలలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మోసానికి పాల్పడ్డ రెడ్డిదినేష్‌కుమార్ పథకం ప్రకారం కువైట్‌కు ఉడాయించాడు. ఐదేళ్ల తరువాత స్వగ్రామానికిరా వడంతో బాధితులు తెలుసుకుని ఎలాగైనా తమ డబ్బులు ఇప్పించాలని పోలీసులను ఆశ్రయించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కేవీపల్లె మండలమే గాక ఇతర మండలాల్లోనూ బాధితులు భారీగా ఉన్నట్లు తెలుస్తోంది.